
ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు ఘన స్వాగతం



భాస్కరరావు దంపతులను సత్కరిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస

జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు ఆర్అండ్‌బి వసతిగృహం వద్ద ఆదివారం ఘన స్వాగతం లభించింది. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అవగాహన సదస్సు సోమవారం జరగనున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా జిల్లాకు వచ్చిన ఆయనకు, ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్‌ను సమాచార పౌర సంబంధాల అధికారులు ఎన్‌వి.రమణ, కెబిఎం.సింగ్, తహశీల్దార్ వెంకటరావు, జివి.రవికుమార్, సిబ్బంది, మీడియా ప్రతినిధులు పుష్ప గుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

విశ్రాంత పాత్రికేయులకు సత్కారం

విశ్రాంత పాత్రికేయులైన తమ్మినేని పురుషోత్తం, ఆమదాలవలసకు చెందిన ఎర్నాగుల సుధాకరరావు, ప్రజాశక్తి దినపత్రికలో సుదీర్ఘకాలం వివిధ స్థాయిల్లో విధులు నిర్వహించి ప్రజాశక్తి శ్రీకాకుళం స్టాఫ్ రిపోర్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన సత్తారు భాస్కరరావును పరామర్శించి, దుశ్శాలువతో చైర్మన్ సత్కరించారు. అనంతరం రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జె.జె మోహనరావును కలిసి వారు సాహిత్యరంగానికి చేస్తున్న కృషిని, పలు అంశాలపై మాట్లాడారు. వారితో పాలు జర్నలిస్టులు ఉన్నారు.

ఆ బాధలు ఆడవారికే..



కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకోవటానికి మగధీరులు నానాటికీ వెనక్కిపోతున్నారు. అన్నింటిలో సగం, ఆకాశంలో సగమంటూ చెప్పకునే మహిళలు శస్త్ర చికిత్సల్లో ముందంజలో నిలుస్తున్నారు. కొన్ని రకాల అపోహలు, అనుమానాలతోనే పురుషులు ఆసక్తి కనబరచటం లేదని వైద్యులు అంటున్నారు.

- కు.నికి మగవారు వెనుకంజ
- అత్యధికంగా ట్యూబెక్టమీలేనన్న వైద్యులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో అత్యధిక శస్త్రచికిత్సలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్నాయి. వీటిలో గత మూడేళ్లుగా పరిశీలిస్తే మగాళ్లకు సంబంధించి మూడు నెలలు, ఆరు నెలలకు ఓ శస్త్రచికిత్స కూడా జరగడం లేదు. అదే మహిళలైతే ప్రతి రోజూ సగటున ఆరేడుగురికి తగ్గకుండా చేయించుకుంటున్నారు..

వారి నుంచే అభ్యంతరం

మగవాళ్లు చేయించుకునే వ్యాసెక్టమీలపై కొందరు మహిళలే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నా భర్త ఆపరేషన్ చేయించుకుంటే కుటుంబం ఎలా గడుస్తుంది? ఆపరేషన్ చేయించుకుంటే బరువులు ఎత్తకూడదని, ఎక్కువ పనులు చేయకూడదని అభ్యంతరాలు చెపుతున్నారు. రకరకాల అపోహలతో ఆడవాళ్లే మగవారిని నిరుత్సాహపరుస్తున్నారు. అపోహలు వీడి భార్యాభర్తలు ఒక అంగీకారానికి వచ్చి చేయించుకునే శస్త్రచికిత్సనూ పట్టించుకోవడం లేదు.

వీరే అధికం..

వ్యాసక్టమి ఆపరేషన్లు చేయించుకునే ఐదారుగురు కూడా మధ్య, ధనికవర్గాలకు చెందిన వారే. వారి లోనూ విద్యావంతులే ఇవి చేయించుకుంటున్నారు. పేదవర్గాలు. నిరక్షరాస్యులు, ఏమాత్రం చదువుకోని వారు వెయ్యికి ఒక్కరూ చేయించుకోవటం లేదని వైద్య ఆరోగ్యశాఖ నివేదికలు చెపుతున్నాయి. మహిళలకు చేస్తే ట్యూబెక్టమీతో పోలిస్తే మగవారికి చేసే వ్యాసక్టమీ చాలా చిన్న శస్త్రచికిత్స.. వారు దీన్ని చేయించుకుంటే మహిళలకు ఎక్కువ లైఫ్ ఇచ్చినవాళ్లవుతారని, అప్పటికే వారు పిల్లలను కనటానికి సిజేరియన్లు అయి ఉండటం, ఆ తర్వాత పిల్లల పెంపకం వంటివి. చేయడం వల్ల రక్తహీనత బారినపడి బక్కచిక్కిపోతారు. వీరికే ఏరికోరి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తే ఇబ్బందని వైద్యులు అంటున్నారు.

సిజేరియన్‌తో పాటే శస్త్రచికిత్సలు

సిజేరియన్ బిడ్డకు జన్మనిచ్చిన వారిలో కొందరు తమకు ఇక పిల్లలు కలగకుండా శస్త్రచికిత్స చేయాలని కోరడం వల్ల పనిలో పనిగా ఈ శస్త్రచికిత్సలను చేస్తున్నారు. ఈ సమయంలో చేసే శస్త్ర చికిత్సలకు ఎల్ఎస్‌సిఎస్ అంటారు. ఈ శస్త్ర చికిత్సలు ఇప్పుడు శతశాతం జరుగుతున్నాయి. మిగిలిన శస్త్ర చికిత్సలతో పోలిస్తే వీటి సంఖ్య రెండు, మూడు రెట్లు అధికంగా ఉంటోంది. వీటి వల్ల సంబంధిత మహిళకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

ప్రచారం ఏదీ

కు.ని. ఆపరేషన్లపై ప్రభుత్వం చేసే ప్రచారం చాలా తక్కువగా ఉంటోంది. సినిమా థియేటర్లు, హోర్డింగ్‌లపైనే పరిమితంగా ప్రచారం చేస్తోంది. ప్రతి ఊళ్లో ఉండే ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు కలిసి ట్యూబెక్టమీ ఆపరేషన్లపై మహిళలను చైతన్యం చేస్తున్నారు. మగవారిని చైతన్య పరచడానికి క్షేత్రస్థాయిలో మగ ఉద్యోగులు కరవయ్యారు. గతంలో సూపర్ వైజర్ కేడరులో ఉన్న వారికి ఈ బాధ్యతలను అప్పగించే వారు. కానీ వ్యాసక్టమి బాధ్యతలను సైతం ఎఎన్ఎంలకే అప్పగించడం వల్ల ఆచరణ సాధ్యంకావడం లేదు. ఈ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

అపోహలతోనే ఆసక్తి చూపటం లేదు

కౌన్సెలింగ్ ఇచ్చి పురుషులను ఒప్పించాలని చూసినా కొందరు మహిళలు మా వారికి వద్దని పేచీ పెడుతున్నారు. మహిళలకు ఐదు నిమిషాలు, పురుషులకైతే మూడు నిమిషాల్లో ఈ ఆపరేషన్ చేసేయొచ్చు. వ్యాసక్టమి చేయించుకున్న వారు కేవలం వారం రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. ఆ తర్వాత నుంచి అన్ని పనులూ చేసుకోవచ్చు. ఇబ్బందులేమీ ఉండవు.

-డాక్టరు బి.మీనాక్షి, డిఎంహెచ్ఒ

జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ డిమాండ్



మాట్లాడుతున్న తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేసి, వెంటనే డబ్బులు చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తోందని, నాణ్యత నిర్ధారణ చేయడంలోనూ, వాహనాలు సమకూర్చడంలోనూ జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, రాష్ట్ర ప్రభుత్వం జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కంచిలి మండలం నువ్వగూడ పంచాయతీలోని 14 గ్రామాల్లో 1-బిలు రావడం లేదని, దీనివల్ల ప్రభుత్వ పంట నష్టపరిహారం, సంక్షేమాలు పథకాలు అమలు కావడంలేదని అన్నారు. ఎచ్చెర్ల మండలంలో తరతరాలుగా సాగు చేస్తున్న నారాయణపురం భూమి సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని, రికార్డులు టెంపరింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు లక్షకు పైగా గిరిజనులు ఉన్నారని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, ఐటిడిఎ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు, కెఆర్ స్టేడియం, కొండంపేట ఎత్తిపోతల పథకంకు నిధులు కేటాయించినట్లు ప్రకటనలు చేసింది తప్ప నిధులు మంజూరు చేయలేదని, దీంతో పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. వెంటనే నిధులు విడుదల చేసి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. చెత్త పన్ను, ఆస్తి పన్ను, మంచినీటి పన్ను, తదితర పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు పన్నులు రూపంలో వసూలు చేస్తున్న ప్రభుత్వం శ్రీకాకుళం నగరానికి భూగర్భ డ్రెయినేజీ లేకపోవడం వల్ల ఏ చిన్నపాటి వర్షం వచ్చిన నగరం జలమయం అవుతోందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కొనారి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకో ఫిషింగ్ హార్బర్

మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

జిల్లాకో ఫిషింగ్ హార్బర్ నిర్మించి, మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం దోకులపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ వడ్డి సరితకరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అపార సముద్రతీరం ఉన్నప్పటికీ మత్స్యకారుల జీవితంలో వెలుగులు లేవన్నారు. ఇప్పటికీ వలస మత్స్యకారులు గానే జీవనం గడపాల్సి వస్తోందన్నారు. తీరంలోని ప్రతి మత్స్యకార గ్రామంలో రూ.25 లక్షలతో మత్స్యకారులకు అవసరమైన షెడ్‌ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అభివృద్ధిని అడ్డుకొనే రాజకీయాలు విడనాడాలని ప్రతిపక్షాలకు హితవుపలికారు. దోకులపాడులో రైతు భరోసా కేంద్రం నిర్మాణం అడ్డుకోవడం ప్రతిపక్షాలకు మంచిది కాదని, ప్రజలు అంతా గమనిస్తున్నారని హితవుపలికారు. అభివృద్ధి ఆలస్యం కావచ్చు కానీ ఆగిపోదని అన్నారు. ఆంధ్రకు నిధులు ఇవ్వ వద్దని కేంద్రానికి చంద్రబాబు లేఖలు రాయడం అభివృద్ధి నిరోధక చర్య అన్నారు. అప్పు నుండి విముక్తి చేస్తానని చెప్పిన చంద్రబాబు ఎవరికైనా మాఫీ చేసారా? అని ప్రశ్నించారు. కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి ఆర్థికంగా బలోపేతానికి చేయూత అందిస్తుంటే దాన్ని రాజకీయాలు చేస్తున్నారని ప్రపక్షాలపై విరుచుకుపడ్డారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, వైసిపి అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు, ఎంపిటిసి కె.ఢిల్లీశ్వరి, తమ్మినాన శాంతారావు, ఎం.భాస్కరరావు, ఎం.హరినారాయణ, కె.గిరిబాబు, హేమంతరాజు, లక్ష్మీనారాయణ, జి.ఈశ్వరరావు,ఎం.భాస్కరరావు, హేమంతరాజు, నర్తు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి

- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్
- మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు ప్రారంభం



మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపైనా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ -2022 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇటువంటి రాష్ట్రస్థాయి కార్యక్రమాలు చేపట్టడం ప్రప్రథమమని అన్నారు. ప్రభుత్వాలు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెయిట్ లిఫ్టింగ్‌కు పుట్టినిల్లు ఆమదాలవలస అని అన్నారు. ఏషియన్ క్రీడల్లో నీలంశెట్టి లక్ష్మి, నీలంశెట్టి నరసమ్మ కోచ్ లక్ష్మణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని అన్నారు. వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ వంటి క్రీడలకు ప్రత్యేకమైన స్థానం, గుర్తింపు ఉన్నాయని అన్నారు. బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్న ఎయు జిమ్ నిర్వాహకులు పాండ్రంకి తారక్, జగన్, శంకర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాత్రుని పాపారావు, టిడిపి నాయకులు ధవళ అప్పలనాయుడు, గుజ్జల లక్ష్మణరావు, కూన నాగు, మాజీ బాడీ బిల్డర్స్ పేడాడ చిన్నారావు, బలివాడ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి

జిల్లా పరిశ్రమల అధికారి జె.ఉమామహేశ్వరరావు





ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యువతకు ఉపాది అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రైవేటు రంగాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాలను జిల్లాకు చెందిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు జె.ఉమామహేశ్వరరావు తెలిపారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తుంది. జిల్లాలో మానవవనరులు సమృద్ధిగా ఉన్నాయి. వాటిని సద్వినియోగపర్చుకునేందుకు వీలుంటుంది. ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆర్థిక సుస్థిరత సాధించడానికి యువతను ప్రోత్సహిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం సాంకేతిక అభివృద్ధి నిధి పథకం, దృష్టి జి, మిషన్ జి, టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ వంటి పథకాలను రూపొందించాం. మేకిన్ ఇండియాలో భాగంగానే ఈ ప్రోత్సాహకాలను అందిస్తున్నాం. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహం, అనుసరిస్తున్న పద్ధతులు, తదితర అంశాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

ప్రోత్సాహక దిశగా పరిశ్రమల ఏర్పాటు ఎలా సాగుతోంది?

జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి. ప్రభుత్వం తరపున వారికి అవసరమైన అన్ని సదుపాయాలనూ కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. జిల్లాలో 290 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో ఇప్పటికే 264 దరఖాస్తులను ఆమోదించడం జరిగింది. 14 దరఖాస్తులను తిరస్కరించాం. మిగిలిన 12 దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగులో ఉన్నాయి. వచ్చిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పరిశ్రమలు నెలకొల్పేందుకు జిల్లా అన్నివిధాల అనుకూలంగా ఉంది. నాగావళి నది నీటిని పరిశ్రమలకు వినియోగించుకునేందుకు సాధ్యసాధ్యాలపై సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. వచ్చిన దరఖాస్తులపై వారం నుండి 21 రోజుల్లోగా అనుమతిని ఇచ్చేందుకు అవకాశం ఉంది.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రైవేటు రంగంలో అందిస్తున్న ప్రోత్సాహం ఎలా ఉంది?

జిల్లాలో మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. విద్యావంతులైన యువత ఇతర ప్రాంతాలకు వలసవెళ్లి అక్కడ పారిశ్రామిక కేంద్రాల్లో ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. అందులో భాగంగా పారిశ్రామిక అభివృద్ధికి యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. కేంద్ర ప్రభుత్వం సాంకేతిక అభివృద్ధి నిధి(టిడిఎఫ్) పథకం తీసుకొచ్చింది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంటు ఆర్గనైజేషన్(డిఆర్‌డిఒ) పోలీసు బలగాల అవసరాలతో సహా, రక్షణ ద్వంద్వ వినియోగ సాంకేతికతలను అభివద్ధి చేయడానికి ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేసింది. ఇందులో ఉత్సాహ వంతులైన యువకులు భాగస్వాములుగా చేరేందుకు వీలు కల్పించింది. దృష్టి జి పేరుతో ట్రై సర్వీసెస్, డిఫెన్స్ ప్రొడక్షన్ డిఆర్‌డిఒ అవసరాలను తీర్చడానికి రక్షణ తయారీకి అత్యాధునిక సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడానికి పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి వీలు కల్పించింది. మిషన్‌జి పేరుతో రక్షణ అనువర్తనాల కోసం స్వదేశీ అత్యాధునిక కళ వ్యవస్థలను నిర్మించడం ద్వారా స్వీయ-విశ్వాసాన్ని ప్రోత్సహించడానికి మరో పథకానికి రూపకల్పన చేశారు. మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా డిఫెన్స్ టెక్నాలజీలో స్వావలంబనను ప్రోత్సహించడానికి టెక్నాలజీ డెవలప్మెంట్ ఫండ్(టిడిఎఫ్) స్థాపించబడింది.

పరిశ్రమల స్థాపనకు అర్హత ఎలా నిర్దేశిస్తున్నారు?

రక్షణ రంగంలో ప్రైవేటీకరణకు డిఆర్‌డిఒ అనుమతించింది. దేశంలో ఎంఎస్ఎంఇ, స్టార్టప్‌లలో నమోదు చేసుకున్న ప్రైవేట్ పరిశ్రమల యాజమాన్యాలకు అనుమతిస్తున్నారు. పరిశ్రమ తప్పనిసరిగా పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ, ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, భాగస్వామ్య సంస్థ, పరిమిత బాధ్యత భాగస్వామ్యం, ఒక వ్యక్తి కంపెనీ, వర్తించే భారతీయ చట్టాల ప్రకారం నమోదు చేయబడిన ఏకైక యజమాని ఉండాలన్నారు. కనీసం 51శాతం వాటా కలిగిన భారతీయ పౌరుడు యాజమానిగా ఉంటూ ఆయన స్వీయ నియంత్రణలో ఉండే పరిశ్రమలకు మాత్రమే అనుమతిస్తారు. ఈ అర్హతలున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. .

స్టార్టప్ కోసం టిడిఎఫ్ స్కీమ్ పొందడానికి ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

స్టార్టప్ తప్పని సరిగా డిపిఐఐటిచే గుర్తింపు పొందాలి. దరఖాస్తు చేసుకున్న వారు మూడేళ్ల కాలపరిమితికి లోబడి పనిచేయాల్సి ఉంటుంది. స్టార్టప్ సారూప్య సాంకేతికత కోసం ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా గ్రాంట్లు/గ్రాంట్స్-ఇన్-ఎయిడ్‌ను పొందకూడదు. పరిశ్రమలో తప్పనిసరిగా కనీసం 51 శాతం వాటాను కలిగి ఉన్న భారతీయ పౌరుడే యజమానిగా ఉండి నియంత్రించే బాధ్యతలను ఆయనే కలిగి ఉండాలి. అప్పుడే ఆయనకు భారతీయ చట్టాలు వర్తిస్తాయి. స్టార్టప్‌ను కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సహాయ ఇంక్యుబేటర్లలో ఒకదానిలో మాత్రమే ఇంక్యుబేట్ చేయాలి. అలాగే ఇంక్యుబేటర్ కనీసం 25 స్టార్ట్‌ప్‌లకు సహాయం చేసిండి అందులో కనీసం 5 డిఫెన్స్, ఏరోస్పేస్ సెక్టార్‌లకు చెంది ఉండాలి.

ప్రాజెక్టు కాల వ్యవధి ఎంత కాలం ఉంటుంది?

ప్రాజక్టు గరిష్ట అభివద్ధి కాల వ్యవధి రెండు ఏళ్లు గా నిర్ణయించారు. పారామితుల ఆధారంగా మూడో స్థాయి మూల్యాంకనం జరుగుతుంది. డిజైన్ సామర్థ్యం, ఫాబ్రికేషన్ , తయారీ సామర్థ్యం, నిర్వహణ , జీవిత చక్రం మద్దతు, వాణిజ్య సాధ్యత , సంస్థ యొక్క సామర్థ్యం , ప్రొఫైల్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. నిధుల మద్దతు ప్రభుత్వం అందిస్తుంది. పరిశ్రమగా ఉండటానికి గ్రాంట్లు రూపంలో నిధులు సమకూరుతాయి. పరిశ్రమ ఆకాడెమియా , పరిశోధనా సంస్థలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. వర్క్ ఇన్వాల్వెంట్ ఎఫ్ అకాడెమియా మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 40శాతం మించ కుండా ఉండాలన్నది ప్రామాణికం. ఆశక్తిగల యువత ముందుకు వస్తే పరిశ్రమలను స్థాపించి ఆర్థిక సుస్థిరతను పెంపొందించు కోవచ్చు. జిల్లాలో యువతకు ఉపాది అవకాశాలు కల్పించేందుకు వీలుందన్నారు.

బాలలు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- శాస్త్రీయ సమాజం నిర్మించాలి
- చెకుముకి సైన్సు సంబరాల ముగింపు సభలో డిఇఒ



విజేతలతో డిఇఒ పగడాలమ్మ


ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

బాలలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఆదివారం చెకుముకి సైన్స్ సంబరాలు ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయంగా పోటీపడే స్థాయికి విద్యార్థులు ఎదగాలని, అప్పుడే శాస్త్రీయ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. తిరుమల చైతన్య మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం అభివృద్ధికి తోడ్పాటు అవుతుందన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. జెవివి గౌరవాధ్యక్షులు కొత్తకోట అప్పారావు మాట్లాడుతూ అశాస్త్రీయ బావనలు, మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తూ బాబాలు, దొంగస్వాములు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ముందుగా వివిధ మండలాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన 46 బృందాల్లోని 138 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీ పరీక్షలను ఉప విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య, పూర్వపు ఉప విద్యాశాకాధికారి కొత్తకోట అప్పారావు పర్యవేక్షించారు. జిల్లా స్థాయి పోటీలో విజేతలకు డిఇఒ బహుమతులను అందజేశారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో నగరంలోని గీంతాంజలి స్కూల్‌కు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విభాగంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుతులు వచ్చాయి. ద్వితీయ బహుమతిని టెక్కలి మండలం సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రణస్థలం మండలం కోష్టలోని నారాయణ స్కూల్ పొందాయి. తృతీయ బహుమతిని పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటబొమ్మాళి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు దక్కించుకున్నారు. జెవివి అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెవివి ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి పి.మురళీధర్, టి.లింగరాజు, సాయి శ్రీనివాస్, ఉదయ్, పి.కూర్మారావు, బి.జనార్ధనరావు, విఎస్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సాయికృష్ణ, ఎన్.నిఖిల్, 9వ తరగతి చదువుతున్న బి.రాజేష్, 8వ తరగతి చదువుతున్న పి.కార్తీక్ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు కరెస్పాండెంట్ సనపల ఉమాదేవి, అకడమిక్ ఇన్‌ఛార్జి బొడ్డేపల్లి పద్మజ, హెచ్ఎం సింగూరు రాజు అభినందించారు.

వైసిపిని ఇంటికి సాగనంపాలి

జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాదెండ్ల మనోహర్, తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో దుష్టపాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు వైసిపి విముక్తి పేరిట ఉద్యమిస్తున్నామని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు జనసేన అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాబోయే రోజుల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. అందు కోసం నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని రణస్థలంలో యువశక్తి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఉత్తరాంధ్ర ప్రాంత నాయకులతో పాటు కళాకారులు, యువత పెద్దసంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు కల్పిస్తామని పాదయాత్రలో యువతను నమ్మించి జగన్ ఓట్లు వేయించుకున్నారని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పొందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎక్కడికి వెళ్లినా యువత ఇదే అంశాన్ని తమ దృష్టికి తీసుకొస్తున్నారని, వారి ఆవేదన అర్థం చేసుకున్నామన్నారు. అందులో భాగంగా యువతకు దిశా నిర్దేశం చేసేందుకు యువశక్తి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మూడున్నరేళ్లుగా రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లిందన్నారు. విభజన చట్టంలో హామీలను నెరవేర్చుకోవడంలో విఫలమయ్యారని అన్నారు. యువతకు జనసేన నాయకత్వంలో భాగస్వామ్యం కల్పించి అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. యువశక్తి ఉత్సవాల్లో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాల యువత భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా యువశక్తి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నాయకులు శివశంకర్, రాజు, గేదెల చైతన్య, మూర్తి యాదవ్, కోరాడ సర్వేశ్వరరావు, కాంతిమతి, పేడాడ


పరీక్ష రాస్తున్న యువకులు

ప్రతిభా పరీక్షకు స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం స్వర్ణభారతి విద్యాసంస్థల ఆవరణలో మాజీ సిబిఐ జాయింట్ డైరెక్టర్, మాజీ ఐపిఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన జెడి ఫౌండేషన్ ప్రతిభా పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ ప్రతిభా పరీక్షకు తమ విద్యా సంస్థ ఎంపిక చేయడం ఆనందంగా ఉందని చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగుల భర్తీ కోసం 6,511 ఉద్యోగాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అందులో ఎస్ఐ, కానిస్టేబుళ్ల పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుల కోసం ప్రయత్నం చేస్తున్న ప్రతిభావంతులైన యువకులకు మరింత ప్రోత్సాన్ని ఇచ్చేందుకు ఈ ప్రతిభా పరీక్షలు పెటినట్టు తెలిపారు. ఈ పరీక్ష ద్వారా వెయ్యి మందిని ఎంపిక చేసి హైదరాబాద్ ఐఎసిఇ శిక్షణ సంస్థతో కలిసి జెడి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇస్తుందన్నారు. ఎంపిక చేసిన వెయ్యి మందికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. ఉత్తరాంధ్రలో 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో ఇచ్ఛాపురం స్వర్ణ భారతి విద్యాసంస్థలను ఒక కేంద్రంగా నిర్ణయించామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి స్వర్ణ భారతి విద్యాసంస్థ ఆవరణలో జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్, జెడి ఫౌండేషన్, హైదరాబాద్ ఐఎసిఇ సంస్థ సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహిస్తున్నారని చైర్మన్ తెలిపారు.

ఎన్‌జిఒ జిల్లా కార్యవర్గ ఎన్నికకు నోటిఫికేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపి ఎన్‌జిఒ జిల్లా కార్యవర్గం ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల అధికారిగా జె.మురళిని రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్ నియమించారు. అధ్యక్ష, కార్యదర్శుల పదవులతో పాటు సహాధ్యక్ష, అయిదు ఉపాధ్యక్ష, నాలుగు సంయుక్త కార్యదర్శులు, మహిళా సంయుక్త కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 15 పదవులకు నిర్వహించనున్న ఎన్నికలకు ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల, అదే రోజున నామినేషన్ స్వీకరణ ప్రక్రియ జరుగుతుంది. 14న నామినేషన్ల ఉపసంహరణ, 20న ఎన్నిక జరగనుంది. విజయనగరం జిల్లా కార్యదర్శి ఎ.సురేష్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఎపిఎన్‌జిఒ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేగల వెంకటరమణ వ్యవహరిస్తారు. షెడ్యూల్ విడుదల కావడంతో ఉద్యోగుల్లో ఆసక్తి పెరిగింది.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషులు డిగ్రీ కళాశాలలో ఈ నెల 12న జవహర్ నాలెడ్జి కేంద్రం ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, జెకెసి సమన్వయకర్త డాక్టర్ డి.పైడితల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెటేరో కంపెనీలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ టిఎస్‌డి, హెఆర్, ఇంజినీర్స్ తదితర ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే నిట్ ఐసిఐసి బ్యాంకులో రిలేషన్షిప్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్ ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఐసిఐసిఐకి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 25 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు, హెటేరో కంపెనీకి ఉద్యోగాన్ని బట్టి అర్హత కలిగిన వారు, జిఎంఆర్ సెక్యూరిటీ సిబ్బందికి కనీసం పదో తరగతి అర్హతతో తమ బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం పది గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8074554118, 9440425606 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వరా?

- ఎంపిడిఒ రాజకీయం చేస్తే మేమెందుకు
- మండల పరిషత్ సమావేశంలో సర్పంచుల ధ్వజం

ప్రజాశక్తి- బూర్జ

పంచాయతీల్లో సర్పంచ్‌లు అనుమతి లేకుండా ఎవరైనా వేలు పెడితే ఉపేక్షించేది లేదని పి.ఎల్.దేవిపేట సర్పంచ్ మజ్జి ద్రోణగిరి ఎంపిడిఒ సురేష్ కుమార్‌పై ధ్వజమెత్తారు. బూర్జ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇన్‌ఛార్జి ఎంపిపి బుడుమురు సూర్యారావు అధ్యక్షతన ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ముందుగా పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల శిక్షణ నిర్వహించారు. పి.ఎల్.దేవిపేట పంచాయతీకి సంబంధించి డబ్ల్యుపిసి నిర్మాణ పనులు ఏజెన్సీల పేరుతో ఎంపిడిఒ ఇతరులకు అప్పజెడం చట్ట ప్రకారం తగదని ద్రోణగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రాజకీయం చేస్తే మేమేంచే యాలని నిలదీశారు. సర్పంచ్‌గా తమరు తీర్మానం ఇచ్చిన తరువాతనే ఏజెన్సీలకు ఈ పనులు అప్పగించామని ఎంపిడిఒ సమాధానమిచ్చారు. ఏదేమైనా మీరూ రాజకీయం చేస్తున్నారని, అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తూ చట్టాన్ని అతిక్రమిస్తున్నారని ద్రోణగిరి ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా నా అనుమతి లేకుండా మా పంచాయతీలో డబ్లుపిసి పనులు ప్రారంభిస్తే కోర్టును ఆశ్రయిస్తానని హెచ్చరించారు. ఎంపిడిఒపై మాకే కాదు, ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఎంపిపి సూర్యారావు, జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు కలుగజేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. ఐసిడిఎస్ ఆధ్వర్యాన అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సక్తమంగా అందించడం లేదని గుత్తావల్లి, పి.ఎల్.దేవిపేట సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పంచాయతీల్లో సర్పంచ్‌లు ఏర్పాటు చేసిన సమావేశానికి వాలంటీర్లు హాజరు కావడం లేదని అనేక మంది సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. కొంత మంది కొత్తగా వచ్చిన ఆదికారులు సర్పంచ్‌లను కలవడం లేదని,కొన్ని శాఖల అధికారులు ఎవరో తెలియని పరిస్థితి ఉందని లాభాం, గుత్తావల్లి సర్పంచ్‌లు వాపోయారు. ఎఒ రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించిందని, రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం విక్రయిస్తే 21 రోజుల్లో రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుందని అన్నారు. హౌసింగ్ ఎఇ ఎం.వి.రమణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మించిన గృహ నిర్మాణాలకు వచ్చే ఏడాది జనవరి పదిలోగా బిల్లులు చెల్లిస్తామని అన్నారు. ఎపిఎం రాము మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు 35 శాతం రాయితీపై యూనిట్లు కొనుగోలు చేస్తే రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఇంటింటికీ కుళాయి నిర్మాణాలకు ప్రభుత్వం రూ.33 కోట్లు మంజూరు చేసిందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎం.వి.కె.నాయుడు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కరణం కృష్ణంనాయుడు, ఇఎంసి మాజీ చైర్మన్, ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, సొసైటీ డైరెక్టర్ కర్నేని నాగేశ్వరరావు, ఎపిఒ రాజ్, ఎఇ మౌనిక, పశువైద్యాధికారి కరుణ, టిడిపి మండల అధ్యక్షులు వి.రాంజీనాయుడు పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న పి.ఎల్.దేవిపేట సర్పంచ్ ద్రోణగిరి

నెలలో పోర్టు నిర్మాణానికి భూమి పూజ

నియోజకవర్గ పరిశీలకులు కాయ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మూలపేటలో నెల రోజుల్లో రూ.5 వేల కోట్లతో పోస్టు నిర్మాణానికి భూమి పూజ చేసి స్థానికలకే ఉద్యోగాలు అవకాశం కల్పిస్తామని టెక్కలి నియోజకవర్గ పరిశీలకులు, మారిటోరియం చైర్మన్ కాయ వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని బోరుభద్రలో ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ టెక్కలి కోటను బద్దలు కొట్టి దువ్వాడ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి సిఎం జగన్‌కు కానుకగా అందించాలన్నారు. అలాగే సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లను, ప్రతి క్లస్టర్ పరిధిలో గృహ వారధులను ఈ నెల 20లోగా నియామకం చేయాలని వైసిపి నాయకులకు ఆదేశించారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ నాడు-నేడుతో పాఠశాలలు సుందరంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు నియోజకవర్గంలో ఒక్క రోజైనా తిరిగి ప్రజలు కష్టాలు తెలుసుకుని సమస్యలను తీర్చారా? అని ప్రశ్నించారు.

80 కుటుంబాలు చేరిక

టిడిపికి చెందిన కళింగ వైశ్యుల 75, ఇతరులు ఐదు కుటుంబాలు కలిపి వైసిపిలోకి చేశారు. వీరికి వెంకటరెడ్డి, శ్రీనివాస్‌లు వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి ఎం.అప్పారావు, వైసిపి నాయకులు పీరుపల్లి రాజశేఖర్, కోత సతీష్, బి.లక్ష్మీకాంతం, బుడ్డా మోహన్‌రెడ్డి, దుక్క భూషణ్‌రెడ్డి, రెయ్య రామిరెడ్డి, అంగ జనార్ధన్, బి.సుధాకర్, పి.రవికుమార్‌రెడ్డి, చింతాడ చిన్నారావు, సూరాడ రాజారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'


సోంపేట : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆధ్వర్యాన మాకన్నపురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు నాయకులు ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైసిపి పాలనలో జరుగుతున్న అరాచకాలు ఇవి అంటూ ప్రచారం చేశారు. ఒక్కసారి ఛాన్స్ అంటూ వచ్చిన జగన్మోహన్‌రెడ్డిని నమ్మి అవకాశం ఇచ్చినందుకు ఇదా దుస్థితి అంటూ నినాదాలు చేశారు. అన్ని సంస్థలను, రంగాలను ధ్వంసం చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, నాయకులు ఎస్.చంద్రమోహన్, చిత్రాడ శ్రీను, జి.కె.నాయుడు, జోగారావు, గోపాల్, ఆర్.శ్రీను, మాధవరావు, యుగంధర్, వాసుదేవరావు, బాబూరావు, ఆనందరావు, ఎం.కోదండరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని రెయ్యిపాడులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఉపాధ్యక్షులు అరసవల్లి ఉమామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, బుల్లోజు శశిభూషణ్, పుచ్చ ఈశ్వరరావు, ఎంపిటిసి సూళ్ల చిట్టిబాబు, యువత అధ్యక్షులు మరడ దుర్యోధన, సైని బాలాజీ, ఆకుల పాపారావు, తిమ్మల కృష్ణారావు, పాపారావు పాల్గొన్నారు.


కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా శ్రీకాంత్ జన్మదినం

మెళియాపుట్టి : తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలను మండల నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు అధ్యక్షతన వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేసి అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పెద్దపద్మాపురం ఎంపిటిసి ప్రతినిధి ఉర్లన బుషి, బాణాపురం సర్పంచ్ పెద్దింటి చంద్రావు, ఎంపిటిసిలు ఉర్లాన హంసమ్మ, జన్ని నాగేష్, ఎస్.రవికుమార్, సర్పంచులు ఎస్.గొరేష్, ఆర్.వాసు, అప్పారావు, రంగారావు, వాబ జగన్ పాల్గొన్నారు.


జ్ఞాపికను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆదిత్యుని సన్నిధిలో రెడ్డి శాంతి

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారా యణ స్వామి ఆలయాన్ని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం సందర్శించారు. ఆమెకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి పలు సేవల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం అనివేటి మండలంలో ఆమెకు అర్చకులు ఆశీర్వచనం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

రూ.4.36 లక్షల ఆదాయం

అరసవల్లిసూర్యనారాయణస్వామి ఆలయా నికి రూ.4.36 లక్షల ఆదాయం సమకూరినట్టు ఇఒ హరిసూర్యక్రాష్ తెలిపారు. టిక్కెట్ల రూపేనా రూ.1,87,600, విరాళాల రూపంలో రూ.49, 368లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2, 00,000 ఆదాయం సమకూరినట్టు తెలిపారు.


తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అక్కుపల్లి శివసాగర్ సముద్ర తీరంలో పర్యాటకులు ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సాగర తీరానికి చేరుకోవడంతో సందడి నెలకుంది. ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన గారబంద, పర్లాఖిమిడి, గొప్పిలి, టెక్కలి తదితర ప్రాంతాల నుంచి యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన వ్యాపారులు, ఉద్యోగులు వారాంతపు సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులతో ఆటవిడుపు కోసం వచ్చారు. సముద్ర స్నానాలు చేస్తూ పిల్లలతో కేరింతలు కొడుతూ సేదతీరుతూ ఆనందంగా గడుపుతున్నారు. తీరానికి వచ్చే రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలను పర్యాటకులు ఎదుర్కొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిపి దాసు

కుళాయి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని లక్ష్మీపురంలో ఎంపిపి డాక్టర్ నిమ్మ దాసు ఇంటింటికీ తాగునీటి కుళాయి పులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.4.75 లక్షలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రాంబట్టి గణపతి, నాయకులు తామర మోహనరావు, గణపతి, పి.వాసుదేవరావు, లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, చంటి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పి మన్మథరావు

దీర్ఘాశిలో గ్రామసభ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో 2021లో నిర్వహించిన ఉపాధి హామీ పనులు నిర్వాహణలో కొన్నిచోట్ల అక్రమాలు జరిగాయని ఎస్ఆర్‌పి కె.మన్మథరావు అన్నారు. మండలంలోని దీర్ఘాశి సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి మెండ కృష్ణ అధ్యక్షతన సామాజిక తనిఖీల్లో భాగంగా ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పి మాట్లాడుతూ 2021-22లో చెరువులు, కాలువలు, పిఆర్ రోడ్లు తదితర పనులు నిర్వహించారని అన్నారు. ఇందులో ఇలాకాల బంద చెరువు పనులకు ప్రతిపాదన పెట్టి పిల్లల బంద చెరువు పనులు చేశామని చూపిస్తున్నారని, ఈ పనులకు రూ.19 లక్షలు ఖర్చు చేశారని తెలిపారు. ఈ పనులను పరిశీలించగా ఎక్కడా పనులు చేసేటట్లు లేవని, వీటిపై ఉన్నతాధికారులు దృష్టిలో పెడతామని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌పి ప్రసాదరావు, ఎంపిటిసి ప్రతినిధి పాకోటి తాతబాబు, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాకోటి అప్పారావు, ఇసి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం


సారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం, నాటుసారాను ఆదివారం నిర్వీర్యం చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో సీజ్ చేసిన 73 మద్యం సీసాలు సారా, 398 లీటర్లు నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

నేడు శిక్షణ

కోటబొమ్మాళి : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఉంటుందని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరుకావాలని కోరారు. ఇప్పటికే సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు, సచివాలయ సిబ్బందికి సమాచారం అందజేశామని తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్




పోటీలను ప్రారంభిస్తున్న మాధురీలత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శ్రీకాకుళం చీఫ్ కోచ్ ఎం.మాధురీలత అన్నారు. నగరంలోని టౌన్ హాల్‌లో అండర్-23 విభాగంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన అన్ని క్రీడలకు సంబంధించిన జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభా పాఠవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్, సహాయ కార్యదర్శి భవాని, ప్రతినిధులు బలభద్రుని రాజా, జి.ప్రసాద్, ఎం.సుధీర్‌వర్మ, ఎన్ఐఎస్ కోచ్ దిలీప్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

టెక్కలి రూరల్ : పంజాబ్ యూనివర్సిటీ చండీగర్ మైదానంలో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ జాతీయ పోటీలకు ఐదుగురు ఎంపికయ్యారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ సత్య తెలిపారు. కణితూరు జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌కు చెందిన పి.అశ్విని, గంగువాడ జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌కు చెందిన కె.హేమసుందరరావు, కాపుతెంబూరు జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌కు చెందిన ఎం.ప్రతాప్‌కుమార్, శ్రీకాకుళం కేశవరెడ్డి స్కూల్‌కు చెందిన టి.భానుతేజ, శ్రీకాకుళం ఆర్‌సిఎం స్కూల్‌కు చెందిన కె.ఆర్.కాంత్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు ఆటయా పాటియా సెక్రటరీ కె.కె.రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాడాన నారాయణరావు, శ్యామలరావు, రాణి, నాగరాజులు అభినందించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న అధ్యాపకులు

సంక్షిప్త వార్తలు

కానిస్టేబుల్ పరీక్షలకు ఉచిత శిక్షణ

రణస్థలం: కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధవుతున్న అభ్యర్థులకు ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో నిఖిల కలిశెట్టి వైద్య, విద్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇస్తున్నామని టిడిపి సీనియర్ నాయకులు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల10 నుంచి15 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తరగతులు 15 నుంచి ప్రారంభిస్తామని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

టెక్కలి ఎస్ఐ-2గా రమేష్‌బాబు


రమేష్‌బాబు, ఎస్ఐ

టెక్కలి రూరల్ : టెక్కలి ఎస్ఐ-2గా కరెమళ్ల రమేష్‌బాబు నియమితులయ్యారు. శ్రీకాకుళం ఎస్ఐగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్ఐ కె.గోపాలరావు శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడూతూ శాంతి భద్రతలు విఘాతం కలగకుండా అన్ని రకాలు చర్యలు చేపడతానని తెలిపారు. టెక్కలిలోని ప్రధాన కూడళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచుతామన్నారు. ట్రాఫిక్‌పై దృష్టిసారిస్తానని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

బూర్జ : మండలంలోని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న డొంకలపర్తలో ఆశా కార్యకర్త నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 25 నుంచి 45 ఏళ్ల వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు నెల 13లోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దుస్తులు పంపిణీ


శ్రీకాకుళం అర్బన్ : దుస్తులను పంపిణీ చేస్తున్న ధర్మారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే కుటుంబాలకు సమాజంలో ఎప్పటికీ కీర్తి ప్రతిష్టలు ఉంటాయని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ మార్పు ధర్మారావు అన్నారు. గార మండలం సాలిహుండం పంచాయతీ కొంక్యానపేటలో కొన్న చిన్నమ్మడు, చిన్నారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆదివారం పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్న-కొంక్యాన కుటుంబాలు ఎల్లప్పుడూ ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఎంపిటిసి గుండ భాస్కరరావు మాట్లాడుతూ ఏటా నిర్వహిస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కొన్న వెంకటేశ్వరరావు (వాసు) మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ఉన్న కాలంలో పెద్ద ఎత్తున దుస్తులు పంపిణీ, సేవా కార్యక్రమాలు నిర్వహించే వారని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఎపిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ ఏటా సాలిహుండం పంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాలతో పాటు ఇరుగుపొరుగు పంచాయతీలో ఉన్న ప్రజానీకానికి పెద్ద ఎత్తున బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, అట్టడ రవిబాబ్జి, పూడి తిరుపతిరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, కొన్న రమణ, కొన్న మధు, పూడి స్వర్ణలత, కొంక్యాన మురళీధర్, పూడి బాలాదిత్య, ప్రగడ అశోక్, బడగల పూర్ణచంద్రరావు, కొంక్యాన శివశంకర్, న్యాయవాది నౌపడ విజయ్ కుమార్ పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : దుప్పట్లను అందజేస్తున్న శ్రీనివాసరావు

టెక్కలి రూరల్ : ఆసరా లేని అభాగ్యుల కోసం స్థాపించబడిన అభయం ఫుడ్ బ్యాంక్‌లో వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడకు చెందిన మార్పు రాజేష్ తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా ఆదివారం 30 మందికి దుప్పట్లు, 50 మందికి అన్నదానం చేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రాజేష్ వలే ముందుకు వస్తే ఇలా చాలామంది అభాగ్యుల ఆకలి తీర్చవచ్చని అన్నారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం సభ్యులు ఎన్.సింహాచలం, ఎస్.రాజేష్, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు జనసేన అండ

ప్రజాశక్తి- కవిటి

బడుగు బలహీనవర్గాలకు అండగా జనసేన ఉంటుందని ఇచ్ఛాపురం జనసేన సమన్వయ కర్త దాసరి రాజు అన్నారు. ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కవిటి మండలం బి.జి.పుట్టుగ పంచాయతీ చెవిపుట్టుగకు చెందిన తుంగాన భాస్కర్, తుంగాన సాగర్, బొర్రపుట్టుగ గ్రామానికి చెందిన షణ్ముఖరావుకు జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ చేతులు మీదుగా ఆదివారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పార్టీలో క్రియాశీల సభ్యత్వం ఉన్నవారికి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. తమ అధినేత ఎంతో దూరదృష్టితో చేపట్టిన ఈ కార్యక్రమం ఎందరికో భరోసా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీలు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా, దుంగు భాస్కరరెడ్డి, అంగ సురేష్, బడగల రామకృష్ణ, దుగాన దివాకర్, జయకృష్ణ పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న మనోహర్

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

దీర్ఘకాలిక వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత, వైద్యులు బొడ్డేపల్లి సురేష్ అన్నారు. మండలంలోని తమ్మినాయ డుపేటలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు దీర్ఘకాలిక జ్వరాలు, రక్తహీనత, కాలుష్య లోపం తదితర సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. బిపి, సుగర్ తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు 200 మంది రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో రైతులకు మేలు

సంతబొమ్మాళి: ఘన జీవామృతంతో రైతులకు మేలు చేకూరుతుందని ఎస్.డి.ఎ.సింహాచలం అన్నారు. మండలంలోని లక్ష్మీపురం క్లస్టర్ సవరపేట యూనిట్ కె.జి.వలసలో అంగ లింగమూర్తి 700 కేజీల ఘన జీవామృతం ఆదివారం తయారు చేశారు. ఘన జీవామృతం దుక్కు దున్న తర్వాత వేసుకొని వేరుశనగ విత్తనాలు వేసుకుంటే మొక్క ఎదుగుదల, పోషకాలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఎల్‌టు షణ్ముఖ, ఉష, రైతులు, మహిళలు పాల్గొన్నారు.


ఘన జీవామృతం తయారు చేస్తున్న రైతులు

సమస్యల పరిష్కారానికి 'రచ్చబండ'


మాట్లాడుతున్న గోవిందరావు

ఆమదాలవలస : ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ నాయకులు కోట గోవిందరావు అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడ, కలివరం పంచాయతీల్లో రచ్చబండ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎటువంటి అవినీతి లేకుండా వాలంటీర్ల ద్వారా ప్రతి 50 ఇళ్లకూ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ఒరవడిని దేశం మొత్తం ఆసక్తిగా చూస్తున్నదన్నారు. రచ్చబండ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించిందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొయ్యన అన్నంనాయుడు, పట్ట ప్రసాదరావు, ఊట రాంబాబు, కొయ్యాన కృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

సానపడితే వజ్రాలే...

కవిటి: నేటి తరం విద్యార్థుల్లో అద్భుత ప్రతిభా పాటవాలు దాగివున్నాయని, ఉపాధ్యాయులు వాటిని గుర్తించి మంచి తర్ఫీదు అందిస్తే ఒక్కో విద్యార్థి ఒక్కో రంగంలో వజ్రంలా మెరుస్తాడని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. వమ్మరవెల్లి డైట్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో నాలుగు విభాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ నెల 12,13 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు పయనమయ్యారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలుగు ఉపాధ్యాయుడు, శిక్షకుడు పి.బి.కె. శర్మ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌లోనూ కవిటి విద్యార్థులు మంచి ప్రదర్శనతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. శిక్షకుడు పిబికె శర్మ, విద్యార్థులు చలపరాయి చాణిక్య చంద్ర, అను సాహు, పి.అరుణ్ కుమార్, ఎన్.మణి వర్మలను అభినందించారు. కోఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, జానకిరావు, ఎన్. విశ్వనాథం, ఎ.జ్యోతికుమారి, నాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు గ్రంథాలయం తరుపున బహుమతులను గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అందచేశారు. తొలుత గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులు చదవడం మాకిష్టం అంటూ ప్రతిజ్ఞ చేసి నినాదాలు తీశారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టంలో సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



చదువుతున్న విద్యార్థిని

దళితులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయని, చివరకు ఆ పార్టీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేశారని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు మట్ట పురుషోత్తం ఆరోపించారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో ఎస్‌సి సెల్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులు 70 ఏళ్లుగా పోరాడి సాధించుకున్న అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దీంతో దళితులను మరింత పేదరికంలోకి నెట్టారన్నారు. ఈ మూడేళ్ల పాలనలో ఎస్‌సిలకు ఆర్థికంగా, సామాజికంగా అణగదొక్కారన్నారు. విద్య, వైద్య అన్ని రంగాల్లో ఇరవై ఏళ్ల వెనక్కి నెట్టేశారన్నారు. దళిత ఓట్లతో గద్దె నెక్కిన జగన్మోహన్‌రెడ్డి పాలనలో దళితపై దాడులు, అత్యాచారాలు, హత్యలను ప్రోత్సహించారని విమర్శించారు. ఎస్‌సి కార్పొరేషన్ మూడు ముక్కలు చేసి మూడు పైసలు కూడా నిధులు ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. గత ప్రభుత్వ హయంలో అమలు చేసిన



మాట్లాడుతున్న పురుషోత్తం

వివిధ సంక్షేమ పథకాలైన విదేశీ విద్య, బ్రైట్ బాయ్స్ స్కీం, కార్పొరేషన్ కళాశాలలో విద్య. అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, దళితులకు చంద్రన్న పెళ్లి కనుక వంటి పథకాలు రద్దు చేశారన్నారు. సమావేశంలో ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోర సరేష్, అధికార ప్రతినిధి ముదిలి సింహాచలం, కార్యదర్శులు శంకరరావు, తలగాన లక్ష్మణరావు. ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి లింగాల రాజన్న (దాసుడు), సారుకోట రామారావు, బంగారు ఆదినారాయణ రమేష్ పాల్గొన్నారు.



పలాస : ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీధర్



కవిటి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

దువ్వాడ శ్రీధర్ నివాసం వద్ద మండలంలోని గంగువాడ గ్రామస్తులు నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ రూ.25 వేలు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వట్టికూళ్ల రాంబాబు, బమ్మిడి దుర్యోధన, కూన హేమాచలం, ఎ.కృష్ణ, ఎ.జగ్గారావు, కాళిదాస్, నాగార్జున, మాధవరావు, బాలరాజు, రామారావు, గున్నయ్య పాల్గొన్నారు.

అలాగే మండలంలోని కేదారిపురం పంచాయితీ పరిధిలోని గంగువాడ గ్రామస్తులు నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి ఎంపిటిసి బి.దుర్యోధన రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు.

జైహింద్ ఫౌండేషన్...

కవిటి: మండలంలోని బల్లిపుట్టుగకు చెందిన హారతి దొలైకి అండగా జై హింద్ సేవా ఫౌండేషన్ నిలిచింది. హారతి పెరాలసిస్‌తో బాధపడుతుండగా, హారతి భర్త ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని వీరి పరిస్థితి తెలుసుకున్న జైహింద్ సేవా ఫౌండేషన్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని తక్షణ సాయంగా రూ.6 వేలు అందజేశారు. దయనీయ పరిస్థితిలో ఉన్న వీరిని దాతలు ఉదారంగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జైహింద్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా బదిలీల జిఒ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం విడుదల చేసిన జిఒలో గత అంశాలను తొలగించడం సబబు కాదని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొండు మధుసూధనరావు, ఎస్.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. రేషనలైజేషన్ గురైన ప్రతి ఉపాధ్యాయునికీ అదనపు పాయింట్లు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అన్ని ఖాళీలను బ్లాక్ చేయకుండా బహిర్గతం చేసి బదిలీలు చేపట్టాలన్నారు. గతంలో గుర్తింపు పొందిన సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అదనపు పాయింట్లు కేటాయించేవారని, ఈ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లోపాలను సరిదిద్ది బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు. విద్యాశాఖాధికారులతో ముందు సమావేశాన్ని ఏర్పాటు చేసి బదిలీల జిఒను ఇవ్వాల్సిన ప్రభుత్వం, ఇచ్చిన తర్వాత అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జిఒ నంబరు 187 బదిలీ ఉత్తర్వులు ప్రభుత్వ బదిలీలు మాదిరిగా ఉన్నాయి, ప్రభుత్వం తమ కోసమే ఈ బదిలీ చేస్తుంది తప్ప ఉపాధ్యాయుల కోసం కాదని విమర్శించారు. ఈ ఉత్తర్వులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే సవరణలతో కూడిన బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

డ్రెయినేజీని నిర్మించరూ...

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కర్లపూడిలో కనీస వసతులకు నోచుకోక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు., పంచాయితీ కేంద్రంలో పూర్తిగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రెండు వీధుల నుంచి వచ్చే మురికి నీరు రహదారిపైనే నిల్వ ఉంటుంది. దీంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కనీసం వీధుల్లో నిల్చొందామన్నా దుర్గంధం వెదజల్లడముతో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. తక్షణమే అధికారులు చొరవ చూపి డ్రెయినేజీ వ్యవస్థ నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



రహదారిపై నిల్వ ఉన్న మురుగు నీరు